ప్రజాశక్తి
గురువారం 18 మే 2023
5
శ్రీకాకుళం

శాస్త్రీయ దృక్పథంతో విద్యా బోధన

ప్రజాశక్తి - పలాస

అభ్యాసనను మెరుగుపరిచే విధంగా బోధనలు ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇండక్షన్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్‌సి-1998, 2008, 2018 ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణలో భాగంగా నేర్చుకున్న పలు అంశాలు తరగతి గదిలో బోధించాలన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవరిచే విధంగా, పర్యావరణంపై స్పృహ కలిగే విధంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ వై.చిన్నంనాయుడు, సమన్వయకర్త ఎ.వేణుగోపాలరావు, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్లు ఎల్.వి చలం, ఆర్.వి రమణమూర్తి, కె.వి రమణ, హెచ్.సంతోష్, బి.వి రమణ, మల్లేశ్వరరావు, పీడీ కె.హరిబాబు పాల్గొన్నారు.

ఫీ 'జులుం'

- వేళ్లూనుకుంటున్న విద్యా వ్యాపారం
- ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు

కార్పొరేట్ విద్య... అత్యుత్తమ విద్య... నాణ్యమైన విద్య... పేరేదైనా అంతిమ లక్ష్యం విద్యా వ్యాపారమే. జిల్లాలో ఇప్పుడు అక్షరాలా అదే జరుగుతోంది. పలు రకాల పేర్లతో విద్యా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వేళ్లూనుకుంటోంది. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన పలు కార్పొరేట్ పాఠశాలలు నేడు మండల కేంద్రాలకూ విస్తరించి వేళ్లూనుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలకూ సరితూగని కొన్ని పాఠశాలలూ అనధికారికంగా టెక్నో, ఇ-టెక్నో, కాన్సెప్ట్, ఐఐటి తదితర పేర్లతో ఫీజుల వసూళ్లలో మాత్రం ముందుంటున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒలేవీ జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయడంలో కొన్ని ప్రయివేటు విద్యాసంస్థలు ఆరితేరాయి. ఆయా పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాల మాట ఎలా ఉన్నా కరపత్రాలు, బ్రోచర్లు, ప్రకటనల ద్వారా వారు చేస్తున్న ప్రచార పటోపానికి విద్యావంతులైన తల్లిదండ్రులూ మోసపోతున్నారంటే, ఆ ప్రచారం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రచార భ్రమలో పడి ప్రభుత్వ పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాలను పక్కన పడేసి, కార్పొరేట్ పాఠశాలల వైపు తాహతుకు మించి పరుగులు తీస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే తక్కువే. మెరుగైన ఫలితాలు సాధించని విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన అరకొర విద్యార్థులనే ఆయా పాఠశాలలు ప్రచారాలకు వాడుకుంటున్నాయి. ఈ హంగూ, ఆర్భాటాలను ఏమాత్రం పట్టించుకోని తల్లిదండ్రులు ఈ విద్యాసంస్థల మోజులో పడి జేబులు ఖాళీ చేయించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యను బోధిస్తూ, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. ఇవే అర్హతలు ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రధానంగా కార్పొరేట్ పాఠశాలల్లో పరిశీలిస్తే ఎక్కడో తప్ప మచ్చుకైనా కనిపించవు.

ఇష్టారాజ్యం

జూన్ 12వ తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రయివేటు విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయి. విద్యార్థుల వేట కోసం మండుటెండలోనూ గడప గడపా తొక్కుతున్నాయి. వేసవి సెలవుల్లో అడ్మిషన్లు చేపట్టరాదని నిబంధనలున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటికితోడు ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు 2012 జులై 30వ తేదీన ప్రభుత్వం జిఒ నంబరు 42ను జారీ చేసింది. దీని ప్రకారం ఆయా విద్యాసంస్థలు కల్పించే సౌకర్యాలను బట్టి అర్బన్ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యకు విద్యార్థుల నుంచి నెలకు రూ.750, ఏడాదికి రూ.తొమ్మిది వేల లోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.650, ఏడాదికి రూ.7,800లోపు వసూలు చేయాలి. హైస్కూల్ విద్యకు అర్బన్ పరిధిలో నెలకు రూ.వెయ్యి, ఏడాదికి రూ.12వేల లోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.900, ఏడాదికి రూ.10,800 లోపు వసూలు చేయాలి. ఈ నిబంధనలు మచ్చుకైనా కనిపించడం లేదు.



అమలుకు నోచని జిఒలు

జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో సుమారు 600 వరకు పాఠశాలలు ఉండగా, సుమారు 140 వరకు గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ఐదో తరగతి వరకు అనుమతులుంటే, ఏడో తరగతి వరకు బోధిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలలు ఏడో తరగతి వరకు అనుమతులుంటే, పదో తరగతి వరకు బోధిస్తున్నాయి. ఇలాంటి విద్యాసంస్థల్లోనూ ఫీజులు చుక్కలు చూపిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్ల పేరుతో వసూలు చేస్తున్న ఫీజులే కాక బస్సు, దుస్తులు, బూట్లు, పుస్తకాలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఆ జాబితా చాంతాడంత ఉంటుంది. వీటి కోసం వేలకు వేల రూపాయలు తల్లిదండ్రుల నుంచి అప్పనంగా గుంజుతున్నారు.

కొరడా ఝుళిపిస్తారా..?

కార్పొరేట్ పాఠశాలల పరిస్థితి అయితే ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. ఏడాదికి సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం కనిష్ట స్థాయిలో జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. కుటుంబ పోషణకే జీతాలు చాలడం లేదని, పెంచాలని ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తే, వారిని తొలగించిన సందర్భాలు కోకొల్లలు. దీంతో మిగిలిన వారు నోరెత్తలేక ఇచ్చిందే మహా ప్రసాదంగా సరిపెట్టుకొని మిన్నకుంటున్నారు. నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలను మూసివేసే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని, ఫీ'జులుం'పై విద్యాశాఖాధికారులు కొరడా ఝుళిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగం కదులుతుందో, లేదో ఆచరణలో చూడాల్సి ఉంది.

నీడ కోసం టెంటు కూడా లేదు

వ్య.కా.స నాయకుల వద్ద ఉపాధి కూలీల ఏకరువు

ప్రజాశక్తి - కొత్తూరు, శ్రీకాకుళం అర్బన్

పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, ప్రథమ చికిత్స పెట్టె, చివరకు ఎండ బారి నుంచి సేదతీరేందుకు నీడ కోసం టెంటు కూడా లేదని ఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల వద్ద ఏకరువు పెట్టారు. మండలంలోని మెట్టూరు బిట్-3 ఇర్రపాడులో ఉపాధి పని ప్రదేశాన్ని వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం తదితరులు బుధవారం పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రతకు రెండు పూటలా పనులు చేయడం కష్టంగా ఉందని చెప్పారు. గతంలో ఇచ్చిన వేసవి భృతి కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే ఈ చట్టానికి బడ్జెట్‌లో నిధుల కోత పెట్టిందన్నారు. వామపక్షాల కృషితో ఏర్పడిన ఉపాధి హామీ చట్టంతో పనుల్లేని సమయంలోనూ కూలీలకు పని లభిస్తుందన్నారు. అటువంటి చట్టంలో ఉన్న సౌకర్యాలకు బిజెపి ప్రభుత్వం కోత పెడుతోందన్నారు. మౌలిక సదుపాయాలు గానీ, వేసవి భృతి గానీ ఇవ్వడం లేదని చెప్పారు. కూలీలకు రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేసవి భృతి 40 శాతం ఇవ్వాలని, వంద రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలకూ పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

విలీన పంచాయతీల్లో 'ఉపాధి' కల్పించాలి

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఇటీవల విలీనం చేసిన గ్రామ పంచాయతీల్లోనూ ఉపాధి హామీని అమలు చేయాలని సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతి రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదపాడులో ఉపాధి కూలీతో ఆయన మాట్లాడారు. చాపురం, పాత్రునివలస, పెద్దపాడు, ఖాజీపేట, కిల్లిపాలెం, తోటపాలెం, కుశాలపురం గ్రామ పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేశారని, ఆ పంచాయతీల్లో ఉపాధి హామీని నిలుపుదల చేయడం వల్ల వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, ఆర్.భద్రమ్మ, ఎం.స్వప్న, సిమ్మమ్మ, పి.సూర్యకాంతం, బి.లక్ష్మి, ఎం.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు, సింహాచలం

జగన్ ముద్దు... రెడ్డి శాంతి వద్దు

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వైసిపి నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి - కొత్తూరు

ర్యాలీ నిర్వహిస్తున్న పాతపట్నం నియోజకవర్గ వైసిపి నాయకులు

వైసిపి నాయకులపై అక్రమంగా కేసులు బనాయించిన పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి బుద్ధి చెప్తామని అదే పార్టీకి చెందిన అసంతృప్త నాయకులు స్పష్టం చేశారు. జగన్ ముద్దు... రెడ్డి శాంతి వద్దు... కార్యకర్తలను వేధిస్తున్న రెడ్డి శాంతి డౌన్ డౌన్, జగనన్నా కార్యకర్తలను రెడ్డి శాంతి నుంచి కాపాడండి అంటూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఎమ్మెల్యే అసంతృప్త వైసిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక రామాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, కొత్తూరు ఎంపిపి సవర సావిత్రి, హిరమండలం ఎంపిపి ప్రతినిధి తూలుగు తిరుపతిరావు తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కష్టపడి పనిచేసి స్థానికేతరులైన రెడ్డి శాంతిని ఎమ్మెల్యేగా గెలిపించామన్నారు. ఎమ్మెల్యే అయ్యాక నియంతృత్వంగా వ్యవహరిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలపైనే అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ స్థానికులకే కేటాయించాలని కోరారు. కాదని స్థానికేతరులకు ఇస్తే వారికి అనుకూలంగా పనిచేయబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి భుజంగరావు, గంగు వాసు, రేగేటి షణ్ముఖరావు, అంపిలి ప్రశాంత్ కుమార్, కె.సంజీవరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహిళా పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక సూచించారు. ప్రపంచ రక్తపోటు రోజును పురస్కరించుకుని నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళా పోలీసులకు ఉచిత గుండెవ్యాధుల నిర్ధారణతో పాటు సాధారణ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహిళా పోలీసులకు షుగర్, బిపి, గుండె సంబంధిత వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. అత్యవసర వైద్య సహాయం అవసరమైన వారికి మెడికవర్ హాస్పిటల్‌లో ఉచిత కన్సల్టేషన్, వైద్య ఖర్చుల్లో 50 రాయితీని అందిస్తారని చెప్పారు. మహిళా పోలీసులు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ద్వారా విధుల్లో ఉత్సాహవంతంగా పనిచేయగలరని చెప్పారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. వైద్య శిబిరంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, వైద్యులు ప్రకాష్, అమూల్య, అనిరుధ్, ఇతర వైద్యులు, ఆర్ఐ ఉమామహేష్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటు వేస్తే భావితరాలకు నష్టం

- కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు
- వైసిపి పాలనపై జనం తిరుగుబాటు తప్పదు
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు
- ఘనంగా ఎన్‌టిఆర్ శత జయంతి, మినీ మహానాడు
- ఏడు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో జగన్‌కు మళ్లీ ఓటు వేసే భావితరాలకు నష్టం చేసిన వారవుతారని కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు, మినీ మహానాడును బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో 151 సీట్లలో గెలిచిన వైసిపి విర్రవీగుతూ టిడిపి నాయకులపై కేసులు, వేధింపులకు పాల్పడుతోందన్నారు. విద్యుత్, ఆర్‌టిసి, ఇంటిపన్నులు, చెత్తపన్నుల రూపంలో ప్రజల నుంచి రూ.మూడు లక్షల కోట్లను పన్నుల రూపంలో వసూలు చేసిందని చెప్పారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు కొంత అన్యాయం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి రాజ్యాంగబద్ధమైన పదవులు ఇస్తామని చెప్పారు.

ప్రజల తిరుగుబాటు తప్పదు

వైసిపి పాలనపై ప్రజల తిరుగుబాటు తప్పదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఒకప్పుడు అన్నింట్లో ప్రథమ స్థానంలో ఉండే రాష్ట్రం, ఇప్పుడు అట్టడుగున ఉందన్నారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో గతంలో ఎన్నడూ జరగని అన్యాయం వైసిపి ప్రభుత్వంలో జరుగుతోందన్నారు. సైకో పాలనను ఎంత తొందరగా వదిలించుకుంటే రాష్ట్రానికి అంత మంచిదన్నారు. సైకో ముఖ్యమంత్రి కోసం తాను చెప్పనక్కర్లేదని జిల్లాకు చెందిన మంత్రి ధర్మాన, పొరుగు జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ వైసిపిలోకి రాక ముందే చెప్పారన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగితే మళ్లీ సైకో పాలనే వస్తుందని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేస్తేనే తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వారమవుతామని చెప్పారు.

వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయాలి

ఎన్‌టిఆర్ పార్టీ పెట్టిన రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే ఇప్పుడూ ఉన్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా విచ్ఛిన్నమైందని విమర్శించారు. టిడిపిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయాలన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి స్వాతి సోమనాథ్ బృందం ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఎన్‌టిఆర్ నటించిన పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలకు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సుమిత్ర సినీ సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది.

మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

పలువురికి సన్మానం

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల సందర్భంగా ప్రముఖ రచయిత పద్మశ్రీ యడ్ల గోపాలరావు, అట్టాడ అప్పలనాయుడు, సంగీత విద్వాంసుడు మావుడూరి సత్యనారాయణ శర్మ, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి స్వాతి సోమనాథ్‌ను ఘనంగా సత్కరించారు. వీరితో పాటు ఎన్‌టిఆర్‌తో అనుబంధం కలిగిన పార్టీ సీనియర్ కార్యకర్తలను సన్మానించారు.

ఏడు తీర్మానాలకు ఆమోదం

మినీ మహానాడులో ఏడు అంశాలపై తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. వ్యవసాయ రంగం,-రైతు సంక్షేమం, కొరవడిన ఉపాధి-నిరుద్యోగ సమస్య, కానరాని అభివృద్ధి, మోసకారి సంక్షేమం, కళా, రాజకీయ రంగంలో ఎన్‌టిఆర్ తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు గౌతు శ్యామసుందర శివాజీ, గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు బగ్గు లక్ష్మణరావు, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నాయకులు పి.విఠల్‌రావు, ఎం.వెంకటేష్, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లాపరిషత్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత గల ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ (ఆంగ్లం, గణితం, వ్యాయామ విద్య)గా ఉద్యోగోన్నతులు కల్పించడానికి ఎస్‌జిటి, పిఇటి తత్సమాన కేటగిరీల సీనియార్టీ జాబితాను డిఇఒ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితాపై అభ్యంతరాలు ఉంటే https://www.sites.google.com/site/deosklorgలో ఈనెల 19వ తేదీ లోపు తెలియజేయాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా వారి పేర్లను సీనియార్టీ జాబితాలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

'ఆఫ్‌షోర్'కు అప్పయ్యదొర పేరు

- సానుకూలంగా సిఎం స్పందన
- బెండిగెడ్డపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు
- పశుసంవర్థక మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు మాజీ ఎంపీ కీర్తిశేషులు హనుమంతు అప్పయ్యదొర పేరు పెట్టాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తే, సానుకూలంగా స్పందించారని రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వెల్లడించారు. మండలంలోని పెద్దబొడ్డపాడు, సీతాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పయ్యదొర ఈ ప్రాంతానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన పేరు ఆఫ్‌షోర్‌కు పెట్టడం సముచితంగా ఉంటుందన్నారు. వంశధార శివారు భూముల రైతుల ఉసురు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుకు తగులుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎగువ భాగంలో అనధికారికంగా 17 లిఫ్ట్ ఇరిగేషన్‌లు దౌర్జన్యంగా కట్టిన అచ్చెన్నాయుడుని సాగునీటి దోషిగా అభివర్ణించారు. హిరమండలం వద్ద ఏర్పాటు చేస్తున్న ఎత్తిపోతల పథకంతో శివారు భూముల్లో సైతం రెండో పంట వేసుకోవచ్చని చెప్పారు. సీతాపురం, పెద్దబొడ్డపాడు చెరువులకు బెండిగెడ్డలో లిఫ్ట్ ఏర్పాటు ద్వారా సాగునీరు అందించడానికి కావాల్సిన అనుమతులు రానున్నాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. నవరత్న పథకాల ద్వారా అందరికీ సంక్షేమం అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పొరపాటున చంద్రబాబు అధికారంలోకి వస్తే నరకాన్ని చూపిస్తాడని, ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలేవీ అందవని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ జగన్‌నే ముఖ్యమంత్రి చేయాలని కోరారు. పెద్దబొడ్డపాడులో మాజీ సర్పంచ్ ఉప్పాడ ఆనందరావు, ఉప సర్పంచ్ దుంపల గోవిందరావు, యువత స్వాగతం పలికి వంశధార నీరు సక్రమంగా అందే విధంగా చూడాలని కోరారు. సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ అధ్యక్షులు హనుమంతు వెంకటరావుదొర, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినాన శాంతారావు, ఎంపిటిసి ఉరిటి కామేశ్వరి, సర్పంచ్‌లు గూడ ఈశ్వరరావు, ప్రసాద్, కె.మల్లేశ్వరస్వామి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం శ్రీకాకుళం కేంద్రీయ విద్యాలయంలో 2022-23 అకడమిక్ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని కలెక్టర్, కేంద్రీయ విద్యాలయ నిర్వహణ కమిటీ చైర్మన్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. కేంద్రీయ విద్యాలయంలో 2022-23 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై కేంద్రీయ విద్యాలయ నిర్వహణ కమిటీ సభ్యులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 అకడమిక్ విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల ప్యానెల్, ఒకటో తరగతి ఆపై క్లాసులకు ప్రవేశాలకు ఇంటర్వ్యూ నిర్వహించాలని కమిటీ సభ్యులను సూచించారు.

కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ కె.శంకరయ్య, కమిటీ సభ్యులు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తరగతి గదుల మరమ్మతులు, వస్తువుల సేకరణ తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌కు నివేదించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం రాబోయే నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఇంటర్వ్యూతో పాటు కమిటీ సభ్యులు సూచించిన అజెండా అంశాలపై నిర్ణయం తీసుకుని ముందుకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కమిటీ సభ్యులైన డిప్యూటీ డిఎంహెచ్ఒ అనురాధ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులందరికీ 'ఉపాధి'

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - గార

ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. మండలంలోని బలివాడ పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిష్ట కూలి పొందే విధంగా నాణ్యమైన పనులు చేపట్టాలన్నారు. కూలీలు సమయపాలన పాటించాలని, రెండు పూటలా చల్లని సమయాల్లో కనీసం ఆరు గంటల సమయం పనులు చేయడం వల్ల పనికి తగ్గ ఫలితం అందుకోగలరని చెప్పారు. ఉపాధి హామీలో కూలీలే యజమానులని తెలిపారు. ప్రతిరోజూ పని ప్రదేశంలో రెండు పూటలా కూలీలు పనిచేస్తున్న ఫొటోలను యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. లేబర్ బడ్జెట్ ప్రకారం అంచనాలు తయారు చేయాలని చెప్పారు. కార్యాలయానికి సమస్యల పరిష్కారానికి వచ్చిన వారి పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ, మండల స్థాయిలో అన్నిరకాల రికార్డులను అప్‌డేట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎపిఒ సీతారాం, ఇసి పి.బాలముకుందబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు నాగమణి, రవి, రత్నాకర్, ఈశ్వరమ్మ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజ శ్రీ శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు
EP. 61/2022 OS.116/2018

Between:
మరడాన శ్రీదేవి --D.hr
And :
గుండ రఘుపతి నాయుడు --J.dr

ఈ నెంబరు అమలు పిటీషన్‌లో శ్రీ కోర్టు వారు **J.dr** తాలుకా ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు ఆస్తులు పైకోర్టులో **తే15-06-2023 ఉదయం 10-30 ని॥ నుండి సాయింకాలము 5గంటల** వరకు బహిరంగంగా వేలము జరుగును. కావున కావలసిన వారు వచ్చి వేలములో పాల్గొనవలెను. వేలము షరతుల గురించి D.Hr గారి లాయరు గారిని గాని శ్రీకాకుళం సెంట్రల్ నాజరు గారిని గాని అడిగి తెలుసుకొనగలరు.

షెడ్యూలు :-

Item No1: శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలు గ్రామ పంచాయితీ సర్వే నెం 44-17లో 0-94 సెు॥ మెట్టు భూమికి హద్దులు.
తూర్పు: సాధు సూరయ్య మెట్టు,
దక్షిణ: గుండ జగన్నాథం మెట్టు
పడమర: కునుకు అప్పయ్య మెట్టు
ఉత్తర: నీటి చెరువు
అమీను విలువ **5,00,000/-**
వాది **D.Hr** విలువ **3,00,000/-**

Item No 2: శ్రీకాకుళం జిల్లా గార మండలం, అంపోలు గ్రామ పంచాయితీ సర్వేనెం 44-18లో 0-39 సెు॥ మెట్టు భూమికి హద్దులు.
తూర్పు: సాధు గంగులు మెట్టు
దక్షిణ: గుండ రామారావు మెట్టు
పడమర: గుండ రామారావు మెట్టు
ఉత్తర: సాధు తవిటయ్య దగ్గర నుండి కొనుగోలు మెట్టు
అమీను విలువ **15,00,000/-**
వాది **D.Hr** విలువ **10,00,000/-**

// BY ORDER OF THE COURT //

పాడి శీతన్నాయుడు
న్యాయవాది,
శ్రీకాకుళం
ఫోన్: 8332967399.

మాట్లాడుతున్న రాజశేఖర్

21న ధర్మాన పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టినరోజు వేడుకలను ఈ నెల 21న టౌన్ హాల్ వేదికగా నిర్వహించనున్నట్లు కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్‌లు తెలిపారు. నగరంలోని టౌన్ హాల్లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ధర్మాన ముందుచూపున్న నాయకుడని కొనియాడారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా పుట్టిన రోజు వేడుకలకు ఆయన దూరంగా ఉన్నారని, అప్పుడు అభిమానుల అభ్యర్థన మేరకు ఈ ఏడాది వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో చట్టసభల్లో ధర్మాన ప్రసంగాలను పుస్తకరూపంలో విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు చెన్నయ్, కర్నాటక గాత్రకళాకారిణికి చెందిన సాంస్కృతిక విభాగాలచే జాతీయ అవార్డులు అందుకున్న గాయని అపూర్వ అనాహిత ద్వయం కార్యక్రమాలు ఉంటాయన్నారు. శుభాకాంక్షలు తెలిపేందుకు ఎవరూ బొకేలు, దుశ్శాలువలు, స్వీట్స్ తీసుకురావద్దని కోరారు. ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించే ఈ వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు మామిడి శ్రీకాంత్, సాధు వైకుంఠరావు, ఎం.ఎ.రఫీ, కోణార్క్ శ్రీను, చల్లా శ్రీనివాసరావు, మండవిల్లి రవి, కె.ఎల్.ప్రసాద్, గురుగుబెల్లి లోకనాథం, నక్క రామరాజు, ఊణ్ణ నాగరాజు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, తదితరులు

ఎమ్మెల్సీ రామారావుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
ఎమ్మెల్సీ నర్తు రామారావు విజయవాడలో ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా ఇచ్ఛాపురం వచ్చారు. ఈ మేరకు వైసిపి నాయకులు రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి బుధవారం ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి నాయకులు రావడంతో రైల్వేస్టేషన్ రోడ్డు కొంత సమయం స్తంభించింది. అక్కడ నుంచి పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, నాయకులు చాటల తులసీదాస్ రెడ్డి, పిలకా సంతోష్, తాడి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది చిందులు

ప్రజాశక్తి- లావేరు
లావేరు మండల తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం కార్యాలయంలో సిబ్బంది పూటుగా మద్యం తాగి చిందులు వేసిన ఘటన చోటు చేసుకుంది. తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి సెలవులో ఉండగా, డిటి డి.నారాయణమూర్తి కలెక్టరేట్‌కు పనిపై వెళ్లారు. దీంతో సిబ్బంది తామే ఏమి చేసినా చూసేవారు, అడిగేవారు లేరని సీనియర్ జూనియర్, అసిస్టెంట్లు, అటెండర్‌లు కలిసి కార్యాలయంలోనే మద్యం తాగారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ పప్పల గోవిందరావు తన సీటులోనే నిద్రించారు. జూనియర్ అసిస్టెంట్ రాజేష్ ప్రజలు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన కుర్చీలో పూటుగా తాగి పడుకున్నారు. అటెండర్ బాబూరావు షర్ట్ విప్పి కార్యాలయంలో స్టెప్పులు వేసి సందడి చేశాడు. హుందాగా ఉండాల్సిన మండల మేజిస్ట్రేట్ కార్యాలయంలో ఈ విధంగా అందరూ తాగి పడుకున్నారు. దీంతో పనిపై వచ్చిన వారందరూ ముక్కున వేలువేసుకొని వెనుదిరిగారు. ఈ ఘోరమని, తమ పని అవ్వలేదని అని ఈసురుమంటూ వెనుతిరిగారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు.

అర్ధనగ్నంగా ఉన్న అటెండర్ బాబూరావు

కుర్చీలోనే నిద్రిస్తున్న రాజేష్

నిద్రిస్తున్న గోవిందరావు

ఇచ్ఛాపురం : ర్యాలీలో పాల్గొన్న విజయ

మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తున్నట్లు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ధర్మపురంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలకు ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ సంతోషంగా ఉండటమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ ప్రస్తుత ప్రభుత్వ పాలన వ్యత్యాసాలను వివరించారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, కంచిలి ఎంపిపి పైలా దేవదాస్‌రెడ్డి, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కె.మోహనరావు, రంపత్ని చిట్టిబాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.
మెళియాపుట్టి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మర్రిపాడు-సి సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హతే కొలమానంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని అన్నారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, జెడ్‌పిటిసి జి.ఎండయ్య పాల్గొన్నారు.

విద్యుత్ కోత... దోమల మోత

ప్రజాశక్తి- టెక్కలి
టెక్కలి పట్టణంలోని శ్రీనివాసనగర్, ఎన్‌టిఆర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ఎండల తీవ్రత వల్ల వేడిమి వాతావరణం పెరుగుతుంది. దీనికితోడు అప్రకటిత విద్యుత్ కోతలు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎల్‌ఆర్ పేరుతో కొంత సమయం కోతలు విధించగా, మరమ్మతుల పేరుతో మరి కొన్ని గంటల పాటు కోతలు విధిస్తున్నారు. నెల క్రితం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా అప్పట్లో నిలిపివేశారు. మరలా ఇప్పుడు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో కోతలు, దోమల మోతలతో, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య కూడా అధికంగా ఉంటుంది.

లోవోల్టేజీతో ఇబ్బందులు

పొందూరు: మండలంలోని రాపాకలో లోవోల్టేజీ సమస్యతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో ఉక్కపోతతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు అల్లాడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఓల్టేజీ హెచ్చుతగ్గులు, తగ్గుతూ ఉండటంతో ఇంట్లో బల్బులు, ఫ్యాన్లు, టివిలతో పాటు విలువైన విద్యుత్ పరికరాలు ఎప్పుడు కాలిపోతాయో అంటూ భయాందోళనలు చెందుతున్నారు. ప్రధానంగా గ్రామంలోని కొండ వీధి, రామాలయం వీధి, భజన్నగారి వీధి, వండాన వారి వీధుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఇక్కడ విద్యుత్ కనెక్షన్లకు సరిపడిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో లోడ్ ఎక్కువై సప్లయ్ నిలిచిపోతుంది. ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు లోవోల్టేజీ వల్ల ఫ్యాన్లు అసలు తిరగడం లేదని చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. దీంతో ఉక్కపోతతో నిద్రపట్టక చిన్నారులను పట్టుకుని ఆరుబయట తిరుగుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిద్ర లేమితో అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు. గ్రామంలో రాత్రి వేళల్లో విద్యుత్ పోతున్నందున, పలు వీధుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదంటూ వారంతా పేర్కొంటున్నారు. దీనిపై ఎఇ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా, సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పగలు, రాత్రి ఒకేలా లోవోల్టేజీ సమస్య ఉంటే తాము ఏమీ చేయలేమని సమాధానమిచ్చారు.

ఆక్రమణలు నిరూపిస్తే తొలగిస్తాం

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వైసిపి నేతల ఆక్రమణలను టిడిపి నాయకులు నిరూపిస్తే వాటిని ప్రొక్లెయినర్‌తో తొలగిస్తామని, లేనిపోని తప్పుడు ఆరోపణలు చేస్తే బుద్ధి చెబుతామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, వైసిపి జిల్లా కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మందస ఎంపిపి డొక్కరి దానయ్యలు హెచ్చరించారు. ఇటీవల మాజీ మంత్రి శివాజీ చేసిన వ్యాఖ్యలపై వైసిపి నాయకులు బుధవారం స్పందించి కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద టిడిపి నాయకులకు ఓపెన్ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో కొంతమంది నాయకులు ప్రభుత్వ భూములు, కొండలు, కాలువలు ఆక్రమించుకొని పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. వాటిని మార్చిపోలేక తిరిగి వైసిపి నాయకులే అక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపణలు చేయడం గురివింద గింజ సామెత గుర్తు చేస్తుందని అన్నారు. తాము సవాల్ విసిరినా ఒక్క టిడిపి నాయకుడు ఛాలెంజ్‌ను స్వీకరించలేకపోయారని వ్యాఖ్యానించారు. అలాంటి వారు విమర్శించడంపై ఎద్దేవా చేశారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు సింహాచలం, గుజ్జు జోగారావు, తామాడ మదన్, సైన దేశయ్య, చింతాడ మాధవరావు, ఉదయకుమార్, పోతనపల్లి హరి, సవర సోమేష్, బమ్మిడి సంతోష్, దువ్వాడ రవి, శిష్టి గోపి, పి.ప్రసాద్, రోణంకి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

బోల్తా పడిన వ్యాన్

వ్యాన్ బోల్తా : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
జాతీయ రహదారిలో పొడుగుపాడు గ్రామ సమీపంలో బుధవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి సాకిపల్లి కొత్తూరుకు ఎర్ర ఉల్లిపాయిలు, తెల్ల ఉల్లిపాయలలోడుతో వ్యాన్ వెళుతుంది. పొడుగుపాడు గ్రామ సమీపానికి వచ్చే సరికి వ్యాన్ వెనుక టైర్ పంచర్ అయ్యింది. వేగంగా వెళ్తున్న వాహనం ఒక్కసారిగా ఉవ్వెత్తున గాలిలోకి ఎగిరి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ దృశ్యాన్ని చూపర్లుకు, వాహనదారులకు ఒకంత ఆచార్యానికి గురిచేసింది. అయితే సాకిపల్లికొత్తూరుకు చెందిన డ్రైవర్ పంగ సింహాచలం స్వల్పగాయాలతో భయటపడడంతో ఏదో జరిగిపోయిందని బావించిన స్థానికులు ఒక్క సారిగా ఊపిరిపీల్చుకున్నారు. దీంతో కొంత ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మృతుని ఆచూకీ గుర్తింపు

కోటబొమ్మాళి: మండలంలో చవితిపాడు చెరువులో పడి మంగళవారం మృతి చెందిన వ్యక్తి నరసన్నపేట మండలం చిన్నబొరిగివలస వాసిగా పోలీసులు గుర్తించారు. మృతుడు చిన్నబొరిగివలసకు చెందిన మాల కృష్ణ కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు, బంధువుల భావిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ తెలిపారు.

నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

బూర్జ : మండలంలోని ఓ.వి.పేట జిల్లా పరిషత్ హైస్కూల్ లో1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు కలిశారు. అప్పటి ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన బరాటం త్రినాథరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఇక్కడ చదివి వివిధ వాదాల్లో స్థిరపడడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎం.నారాయణస్వామి, బుడుమూరు నారాయణమూర్తి, కె.రమణమూర్తి, బీమారాజు, దుర్యోధనరావు, సూర్యారావు, గోవిందరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన వాహనాలు

ఈ మలుపు ప్రమాదాలకు పిలుపు

కోటబొమ్మాళి: మండలంలో హరిశ్చంద్రపురం రహదారిలో ఉన్న మలుపులు ప్రమాదానికి పిలుపులుగా మారాయి. తరచూ ఈ మలుపుల్లో ద్విచక్రవాహనదారులు ఢీకొనడం నిత్యకృత్యమైంది. అయితే ఆర్అండ్‌బి అధికారులు ఈ రోడ్డులో ఎప్పటికప్పుడు జంగిల్ క్లియర్స్ చేస్తే ప్రమాదాలు జరిగేవి కావు. రోడ్డు పక్కన చెట్లు, ముళ్ల పొదలు గుబురుగా పెరిగిపోవడంతో దగ్గరికి వచ్చినంత వరకు ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించక ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియర్స్ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

మృతుని కుటుంబానికి అండ

కవిటి: మండలంలోని సీమురుకు చెందిన దినసరి కులి శివంగి గురుమూర్తి ఇటీవల కొబ్బరి చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. సభ్యులు బుధవారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు రూ.7 వేలు నగదు అందజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ఇద్దరు చిన్నారులతో దయనీయ పరిస్థితిలో ఉన్న గురుమూర్తి కుటుంబాన్ని ఉదారంగా ఆదుకోవాలని కోరారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రపతిరావు

కలెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును ఇటీవల అందుకున్నారు. ఈ మేరకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలెక్టరేట్‌లో బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. బిసి సంక్షేమ సంఘం ప్రతినిధులు కూడా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో అధ్యక్షులు చంద్రపతిరావు, ప్రధాన కార్యదర్శి బడాన దేవభూషణరావు, కర్రీ రంగాజీదేవ్, అమిరుల్లా బేగ్, జంజూలూరి రామారావు, ఇప్పిలి చిన్నారావు, కాళ్ల వేణు, మంత్రి వెంకటస్వామి, న్యూశ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర టి.మణికంఠరావు, శ్రీశ్రీ ఫౌండేషన్ చైర్మన్ చిందు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి- పొందూరు
కనీస వేతనం రూ.18 వేలుకు పెంచాలని కోరుతూ జూన్ 1 నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని పొందూరు మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు తెలిపారు. ఈ మేరకు ఎంపిడిఒకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వేతనాలను పెంచలేదరని వాపోయారు. పెరిగిన నిత్యావసర, గ్యాస్, పెట్రోలు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సమ్మె నోటీసు అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

సంక్షిప్త వార్తలు

పాత వస్తువుల సేకరణ

ఆమదాలవలస : పురపాలక సంఘంలో రెడ్యూస్ - రీసైకిల్ - రీయూజ్ నినాదంతో పది రోజుల పాటు పాత వస్తువులు సేకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ పట్నాభివృద్ధి గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగానే మే 20 నుంచి 30 వరకు రీసైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ తదితర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు చెప్పారు. వస్తువుల సేకరణ నిమిత్తం పట్టణంలోని మోనింగి వారి వీధిలో ఉన్న ఐడిఎస్ఎంటి కాంప్లెక్స్ వద్ద స్టాల్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. పట్టణ ప్రజలు ఈ స్టాల్ వద్ద పాత వస్తువులను అందజేయాలని కోరారు. పాత వస్తువులను రీ యూజ్ - రీసైకిల్ కొరకు ప్లాంట్‌కు పంపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

25న ఆన్‌లైన్‌లో మోడల్ పరీక్ష

టెక్కలి : ఎపిపిజిసిఇటి-23 నమూనా మోడల్ పరీక్ష ఈ నెల 25న ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నామని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర విభాగం నిర్వాహకులు బేపల సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6న నిర్వహించనున్న ఈ పరీక్షకు సంబందించి డిగ్రీ కళాశాల వేదికగా మూడు విడతలుగా ఆన్‌లైన్ విధానంలో మోడల్ పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. సిబిటి ఆన్‌లైన్ మోడ్ విధానం ద్వారా రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ నెల 28న రెండో పరీక్ష, నెలాఖరున మూడో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9603259676 సెల్ నంబరును సంప్రదించాలని తెలిపారు.

కళాకారులకు సన్మానం

ఇచ్ఛాపురం : జాతరో జాతర పాటలను అందించిన కళాకారులకు బుధవారం కుమారస్వామి పూజా కమిటీ సన్మానించింది. గాదె వారి వీధి, కరణం వీధి నర్మదేశ్వర ఆలయం కూడళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇచ్ఛాపురం గ్రామదేవత సంబరాల్లో జాతరో జాతర పాటలను అందించిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ అధ్యక్షులు గాయకులు చిన్నా గురు స్వామి, నీలాపు మనీషా, కొత్త లావణ్య, కీబోర్డు హేమంత్‌కుమార్, బాడిత్య, తబలా నిత్యానంద్ బాడిత్య, ఎ.త్రినాథరావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

వృద్ధులకు మధుమేహ పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ఉచిత మధుమేహ పరీక్షల శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు సంపత్‌కుమార్ పాల్గొన్ని మధుమేహం, రక్తపోటు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, వార్డెన్ లలిత పాల్గొన్నారు.

రాత్రివేళల్లో పకడ్బందీగా గస్తీ

శ్రీకాకుళం రూరల్: రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ నిర్వహించి దొంగతనాలను నియంత్రించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని శ్రీకాకుళం రూరల్ మండల పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, ముఖ్యమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు సరళిని అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో అధికారులకు పలు సూచనలు చేశారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఆస్తి సంబంధిత నేరాలు, వివిధ రకాల సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. యువత అభ్యున్నతికి ప్రతిష్టాత్మకంగా రూపొందిన జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత, విద్యార్థులకు ఐదు రోజుల పాటు శిక్షణ నిర్వహించి పోలీసు విధులు, చట్టాలు, శిక్షలు, చెడు వ్యాసనాలకు అలవాటు పడటం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో వారికి ట్రాఫిక్ విధులు, దిశ యాప్ డౌన్‌లోడ్ విధులు వంటి వాటిలో పోలీసులతో పాటుగా విధులు కేటాయించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నంబరు 1902 ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌పి రాధిక

గుండెపోటుతో సీమెన్ మృతి

శ్రీనివాసరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడకు చెందిన బుడగట్ల శ్రీనివాసరావు (32) సీమెన్ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చెన్నయ్ నుంచి శ్రీలంకలోని కొలంబో వెళున్న క్రమంలో చెన్నయ్‌కి సమీపంలో బుధవారం గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందినట్లు సర్పంచ్ తేరిపల్లి వరదరాజులు తెలిపారు. మృతుడికి భార్య భవానీ, కుమార్తె ఉన్నారు. అందరితో సరదాగా ఉండే సీమేన్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి

లావేరు : ప్రతి విద్యార్థీ వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.శంకరరావు అన్నారు. లావేరు మండలం మురపాక శాఖాగ్రంథాలయాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వేసవి విజ్ఞాన శిబిరంలో రోజూ ఒక రిసోర్స్ పర్సన్ ద్వారా అనేక విషయాలు నేర్పుతున్నారని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రకరకాల పుస్తకాలు ఇక్కడ ఉంటాయని, వాటిని చదువుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్ మల్లిపెద్ది వెంకట అప్పారావు, సహాయకులకు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.
బలగ : విజ్ఞానం కోసం వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథాల అధికారి పి.ఉగ్రసేను పేర్కొన్నారు బలగ శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు యోగాసనాల నేర్పించారు. అనంతరం కథలు, వారికి వచ్చిన తెలుగు పద్యాలు వారిచే చెప్పించారు. గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత, 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు.
రణస్థలం : గ్రంథాలయాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ ఎ.త్రినాథరావు అన్నారు. అనంతరం పుస్తకాలు, దినపత్రికలు, కథలు చదించారు. గ్రంథాలయ అధికారిణి పి.వరలక్ష్మి, భాస్కరరావు, ధర్మారావు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
స్టోన్ క్రషింగ్, పోలీసింగ్, గ్రానైట్ ఫ్యాక్టరీలు, ఇటికీ బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు ఆయా యాజమాన్యాలు పని ఒత్తిడి తగ్గించి రక్షణ కల్పించాలని అసిస్టెంట్ లేబర్ అధికారి రాజకుమారి సూచించారు. టెక్కలిలో భవన కార్మికులతో, మేఘవరంలో గ్రానైట్ ఫ్యాక్టరీ కార్మికులతో, కోటబొమ్మాళి మండలం కొత్తపేటలో ఉపాధి కూలీలతో బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చల్లని ప్రదేశం, చల్లని వాతావరణంలో, ఇన్‌సైడ్ ప్రదేశాల్లో పని కల్పించాలన్నారు. రోజు వారి పని కాకుండా ఉదయం 10లోపు, సాయంత్రం 3 తరువాత పని కల్పించాలన్నారు. అలాగే పనిప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ నుంచి రక్షణ కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్మికశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న రాజకుమారి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పోలాకి: మండలంలోని గోపాలపేటకు చెందిన టిడిపి నాయకులు గదిలి ఈశ్వరమ్మ తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం పరామర్శించారు. అలాగే దూకలపాడులో బొంగు అప్పన్న భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయనను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రపంచ శాంతికి మార్గ నిర్దేశకుడు గాంధీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ప్రపంచ శాంతికి మార్గనిర్ధేకుల జాబితాలో మహాత్మాగాంధీ పేరు ముందంజలో ఉంటుందని తమిళనాడుకు చెందిన శంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, కేరళ గాంధీ దర్శన్ వేది చైర్మన్ ప్రొఫెసర్ ఎం.సి.దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా గరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరాన్ని సందర్శించారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి ప్రొఫెసర్ దిలీపుకుమార్, ప్రొఫెసర్ సుందరమూర్తి పెరుమాల్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గాంధీ మందిర కమిటీ తరపున సీనియర్ పాత్రికేయులు కొంక్యాన వేణుగోపాల్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. ప్రతినిధులు నటుకుల మోహన్, మెట్ట అనంతభట్లు జ్ఞాపికలు అందజేశారు. మందిర సమన్వయ కర్త ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, వంగా మహేష్ దేవ్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం
మండలంలోని పాతర్లపల్లిలో ఎన్‌పిసిఐఎల్. నిధులు రూ.32 లక్షలతో 60 కెఎల్ కెపాసిటీతో మంజూరు చేసిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎన్‌పిసిఐఎల్ యాజమాన్యం అభివద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. దీంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎన్‌పిసిఐఎల్ అధికారులు పి.బంగారయ్యశెట్టి, బి.రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పి.పి.సూర్యనారాయణ, జెఇ రామారావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ పాల్గొన్నారు.